క్లుప్తంగా

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

కనిగిరి రూరల్: ప్రస్తుతం మారుతున్న వాతావరణంతో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. శుక్రవారం ఎన్జీవో కాలనీ, తదితర ప్రాంతాల్లో పర్యటించారు. సూచించారు. వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఏఎన్ఎంలు, సచివాలయ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

వితలాపురంలో వైద్య శిబిరం

పీసీపల్లి: సీజనల్ వ్యాధులు పట్ల అప్రమంతంగా ఉండాలని ఎంపీడీవో ప్రభాకర్ శర్మ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోనే వితలాపురం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. వీధుల వెంట బ్లీచింగ్ చల్లించాలని సూచించారు.

పాఠశాల గ్రాంట్లు వినియోగించుకోండి



మిడ్ డే మీల్స్ పరిశీలిస్తున్న ఎంఈఓ కొండారెడ్డి

సీఎస్‌పురం (పామూరు): సమగ్రశిక్ష ద్వారా విడుదలైన గ్రాంట్లను వినియోగించుకోవాలని మండల విద్యాశాఖాధికారి రాజాల కొండారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆర్‌కేపల్లి, రామాపురం, అగ్రహారం పాఠశాలలను తనిఖీ చేశారు. అపార్ నంబర్లు రూపొందించే ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలన్నారు. భోజనం నాణ్యత పరిశీలించి పలు సూచనలు చేశారు.

విజయ్ కుమార్‌ను కలిసిన రమణా రెడ్డి



వైవిధ్య బోర్డు చైర్మన్‌తో పీవీ రమణారెడ్డి

కనిగిరి రూరల్: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర జీవ వైవిధ్య బోర్డు చైర్మన్ నీలయపాలెం విజయ్ కుమార్‌ను ప్రకాశం జిల్లా గణాంక శాఖ అధ్యక్షుడు, కనిగిరి ఎన్జీవో సంఘ అధ్యక్షుడు పిల్లి వెంకట రమణారెడ్డి మంగళగిరిలోని రెయిన్ ట్రీ పార్క్ భవనంలోని కార్యాలయంలో శుక్రవారం కలిసి సన్మానించారు. గణాంక శాఖ పటిష్టతకు, అభివృద్ధికి సహాయ సహకారాలు అందిచాలని కోరినట్లు తెలిపారు. సంఘ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కార్యవర్గ సభ్యులు చెంచిరెడ్డి, మునిరాజ్, తదితరులున్నారు.

వేలం ఆదాయం రూ.4.26 లక్షలు



వేలం నిర్వహిస్తున్న ఈఓ, ఇన్‌స్పెక్టర్

పామూరు: మండల కేంద్రమైన పామూరులోని శ్రీవల్లీ భుజంగేశ్వరస్వామి, శ్రీమదన వేణుగోపాలస్వామి ఆలయాలకు చెందిన 2 దుకాణాలకు శుక్రవారం వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పర్యవేక్షణలో ఈఓ ఎస్‌జీఆర్ నరసింహబాబు వేలం నిర్వహించారు. శ్రీభుజంగేశ్వరస్వామి ఆలయానికి చెందిన దుకాణానికి ఏడాదికి రూ.3.66 లక్షలు, మదన వేణుగోపాలస్వామి దేవస్థానంకు చెందిన దుకాణం నిర్వహించుకునే రూ.60 వేలుగా దక్కించుకున్నారు.

ఓటు నమోదుపై అవగాహన



మాట్లాడుతున్న తహసీల్దార్ మురళి

కొండపి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఓటు హక్కు పై శుక్రవారం తహసీల్దార్ మురళి, సింగరాయకొండ తహసీల్దార్ టి. రవి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైందన్నారు. అనంతరం బస్టాండ్ ఆవరణ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ రామాంజనేయులు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ డేవిడ్, మండల విద్యాశాఖ అధికారులు సురేఖ, రామారావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

టంగుటూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 14న చీమకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ సెలక్షన్స్‌లో అండర్ – 14 విభాగంలో జి. కీర్తన, కౌషిక్ కుమార్, అండర్ – 17 విభాగంలో అరుణ్ కుమార్, రాంచరణ్ తేజ, హేమలత ఎంపికయ్యారని శుక్రవారం ప్రాధానోపాధ్యాయుడు నరసరాజు తెలిపారు. అనంతపురం జిల్లా కొనకండ్లలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీలల్లో పాల్గొంటారని తెలిపారు.

మత్తులో చిత్తు

- యథేచ్ఛగా బెల్ట్ షాపుల నిర్వహణ
- టీడీపీలో వర్గ విభేదాలు
- పెద్దల అండ ఉంటే దాడులు జరగవు



టంగుటూరులోని మద్యం షాపు వద్దే మద్యం సేవిస్తున్న మందుబాబులు

సింగరాయకొండ:

నియోజకవర్గంలో మద్యం ఏరులై పారుతోంది. ఆరు మండలాల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం హయాంలో బెల్టు షాపుల దందా జోరుగా సాగుతున్నా ఎక్సైజ్, పోలీసు అధికారులు నామమాత్రపు దాడుల్లో సరిపెడుతున్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మూడు నుంచి నాలుగు వరకు బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. ఈ ప్రకారం సుమారు 120కి పైగా బెల్టు షాపులున్నాయి. ఈ బెల్టు షాపులపై కన్నెత్తి చూసే సాహసం అధికారులు చేయలేని దుస్థితి నెలకొంది. ఇటీవల కొన్ని గ్రామాల్లో ఎక్సైజ్, పోలీసు అధికారులు దాడులు చేసి బెల్టుషాపు నిర్వాహకులను అదుపులోకి తీసుకుని తరువాత కేసులు పెట్టకుండా వదిలేసిన సంఘటనలు ఉన్నాయి. కొండపి మండలం పెట్లూరు, సింగరాయకొండ మండలం ఊళ్లపాలెంతో పాటు వెలుగులోకి రాని ఘటనలు చాలా ఉన్నాయి. టీడీపీ సానుభూతి పరులను అదుపులోకి తీసుకోగానే వీరికి టీడీపీ అధిష్టానం నుంచి ఫోన్ వస్తుందని అలాంటప్పుడు మాకేం భయం అని విర్ర వీగుతున్నారు. అంతేకాక కొన్ని గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించుకోవాలంటే టీడీపీ నాయకులకు భారీగా డబ్బులు చెల్లించాల్సి ఉందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బెల్టుషాపుల్లో ఉదయం పూట బాటిల్‌కు అదనంగా 50 రూపాయలు.. రాత్రి పూట 70 నుంచి 100 రూపాయలు తీసుకుంటున్నారు. అయితేనేం 24 గంటలు మందు దొరుకుతుందని తీసుకుంటే తీసుకున్నార్లే అని మందుబాబులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు టీడీపీ నాయకుల మద్దతు ఉన్న బెల్టుషాపుల్లో ఒక్కో బాటిల్‌కు 20 రూపాయల చొప్పున ఇవ్వాల్సి ఉంటుందని అప్పుడే వారి అండదండలు ఉండే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం లైసెన్స్‌డ్ మద్యం షాపుల వద్దే మద్యం సేవిస్తున్నారు. అంతేకాక రెస్టారెంట్‌ల లో కూడా మద్యం సేవిస్తున్నారు. దీంతో ఇటీవల ఎక్సైజ్ అధికారులు రెస్టారెంట్ నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి కొద్దిరోజుల పాటు రెస్టారెంట్‌లలో మద్యం సేవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బతిమాలుకోవడం గమనార్హం. దీనిని బట్టి నియోజకవర్గంలో మద్యం ప్రియులకు ఏ విధంగా రాచ మర్యాదలు జరుతుతున్నాయో అర్థం అవుతుంది.

బింగినపల్లి టార్గెట్

బెల్టుషాపుల వ్యవహారంలో టీడీపీలో గ్రూపు రాజకీయాలు బట్టబయలు అవుతున్నాయి. ఇందుకు బింగినపల్లి గ్రామంలో ఇటీవల ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన దాడులే నిదర్శనం. గ్రామంలో కేవలం వారం రోజుల వ్యవధిలోనే టీడీపీ సానుభూతిపరులకు చెందిన రెండు బెల్టుషాపులపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేయడం చర్చనీయాంశమైంది. మండలంలోని అన్ని గ్రామాల్లో బెల్టుషాపులు విచ్చలవిడిగా ఉంటే కేవలం బింగినపల్లి గ్రామం పైనే ఎక్సైజ్ అధికారులు దాడులు చేయడం పై.. టీడీపీలోని గ్రూపు రాజకీయాలే కారణమని తెలిస్తోంది. ఈనెల 9వ తేదీన ప్రధాన సెంటర్లో విజయలక్ష్మికి చెందిన బెల్టుషాపుపై దాడి చేసి 19 బాటిల్స్ పట్టుకోగా, 14వ తేదీ ఎస్సీ కాలనీలోని పేరాబత్తిన శ్యాం ప్రసాద్ బెల్టుషాపుపై దాడి చేసి పట్టుకున్నారు. ఇతని భార్య పోలీసు శాఖలో పనిచేస్తున్నట్లు సమాచారం. దీంతో ఎక్సైజ్ అధికారులు 13వ తేదీ గురువారం బెల్టుషాపుపై దాడి చేసినప్పటికీ ఎటువంటి కేసు నమోదు చేయలేదు. ఆ తరువాత ఆ విషయాన్ని టీడీపీలోని మరో వర్గం వారు ప్రచారం చేయడంతో ఎట్టకేలకు 15వ తేదీ శుక్రవారం కేసు నమోదు చేశారు. దీంతో గ్రామంలో టీడీపీలోని వర్గవిభేదాలు మరోసారి బట్టబయలయ్యాయని గ్రామస్తులు తెలియజేస్తున్నారు. అలాగే గ్రామంలో ఇరు వర్గాలకు చెందిన మరో 5 బెల్టు షాపులున్నాయని వీటిపై కూడా త్వరలో దాడులు జరిగే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. ఎక్సైజ్ అధికారులు ఒక్కసారిగా కాకుండా వాయిదాల పద్ధతిలో దాడులు చేస్తున్నారని గ్రామస్తులు వారి పనితీరును విమర్శిస్తున్నారు. దీంతో బెల్టుషాపు నిర్వాహకులు ఏ వర్గాన్ని నమ్ముకోవాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు.



బింగినపల్లికి చెందిన బెల్టుషాపు నిర్వాహకునిపై శుక్రవారం కేసు నమోదు చేశామని చెబుతున్న ఎక్సైజ్ పోలీసులు (ఫైల్)

మద్యం బెల్టు షాపులపై దాడులు



కందుకూరు రోడ్డు జంక్షన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై మహేంద్ర

సింగరాయకొండ: మండల కేంద్రంలోని బెల్టుషాపులపై శుక్రవారం ఉదయం నుంచి ఎస్సై బి. మహేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సుమారు 10 షాపులు పరిశీలించారు. ఎవరైనా అమ్మకాలు జరిగిపే చర్యలు తప్పవని హెచ్చరించారు.

టంగుటూరు: బెల్టు షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి జైలుకి పంపుతామని ఎస్సై నాగమల్లేశ్వరరావు అన్నారు. మండలంలో పలు గ్రామాల్లో బెల్టు దుకాణాలపై దాడులు చేశారు. అనంతవరం గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న కటుకూరి కోటేశ్వరరావు వద్ద 9, జయవరం గ్రామంలో చుండి జయరావు వద్ద 6 క్వార్టర్ సీసాలు స్వాధీనం చేసుకున్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

పామూరు: అక్రమంగా మద్యం బాటిళ్లు నిల్వ ఉంచిన ఇరువురిని అరెస్ట్ చేసి సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై టి.కిషోర్‌బాబు శుక్రవారం తెలిపారు. మండలంలోని మోపాడులో మహిళ అక్రమంగా నిల్వ ఉంచిన 17 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఇనిమెర్ల గ్రామంలో మద్యం బెల్ట్ దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి అతనివద్ద నుంచి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంటే తెలియజేయాలన్నారు.

మర్రిపూడి: మర్రిపూడి మండలం జువ్విగుంట గ్రామంలో అక్రమంగా మద్యం బెల్టు నిర్వహిస్తున్న ఒకరిని అదుపులోకి తీసుకుని 27 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు ఎస్సై రమేష్ బాబు తెలిపారు.

20 గ్రాముల గంజాయి..

టంగుటూరు: స్థానిక మద్యం దుకాణం వద్ద ఓ వ్యక్తి వద్ద 20 గ్రాముల గంజాయిని శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఓ యువకుడు మద్యం దుకాణ వద్ద అనుమానంగా తిరుతుండటంతో గమనించిన పోలీసులు తనిఖీ చేసి 20 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని, అదుపులోకి తీసుకున్నారు. అతని గృహంతో పాటు అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నట్లు సమాచారం.

బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే చర్యలు



టంగుటూరు: స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై నాగమల్లేశ్వరరావు



మోపాడులో మద్యం కలిగి ఉన్న మహిళతో ఎస్సై, సిబ్బంది



సిబ్బందితో డ్రిల్ నిర్వహిస్తున్న కొండపి సీఐ సోమశేఖర్

పామూరు: మద్యం బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ యం.భీమానాయక్ హెచ్చరించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం రాత్రి మండలంలోని మద్యం దుకాణం యజమానులతో మాట్లాడారు. స్థానిక ఎస్సై టి.కిషోర్‌బాబు పాల్గొన్నారు.

ప్రజలతో సత్సంబంధాలు ఉండాలి

కొండపి: ప్రజలతో ప్రతి ఒక్కరూ సత్సంబంధాలు కలిగి ఉండాలని కొండపి సీఐ సోమశేఖర్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో సర్కిల్ పరిధిలోని పోలీసులకు డ్రిల్ నిర్వహించారు. ముందుగా స్థానిక పోలీస్ స్టేషన్ లో సర్కిల్లోని డ్రిల్ నిర్వహించారు. కొండపి ఎస్ఐ ప్రేమ్ కుమార్, పొన్నలూరు ఎస్ఐ అనుక్, మర్రిపూడి ఎస్ఐ రమేష్ బాబు, సర్కిల్ పరిధిలోని సిబ్బంది పాల్గొన్నారు.

కొండపి: అక్రమంగా మద్యం విక్రయం చేస్తున్న ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకొని 13 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు కొండపి ఎస్ఐ ప్రేమ్ కుమార్ తెలిపారు. పెరిదేపిలో తాత వెంకట్రావును అనే వ్యక్తి మద్యం అమ్ముతుండగా గుర్తించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



కందుకూరు వరి పైరు పరిశీలిస్తున్న అధికారులు

కందుకూరు రూరల్: రైతులు సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులు పాటించి నాణ్యమైన దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి వి.రాము అన్నారు. మండలంలోని మోపాడు గ్రామంలో గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ (గ్యాప్) పొలంబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ చీడపీడలు, మిత్ర పురుగులు, శత్రు పురుగుల మీద విషయ పరిజ్ఞానం ఎంత ఉందో తెలుసుకోవడానికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. చివరి దుక్కిలో ముడి జింక్ సల్ఫేట్ 20 కేజీలు ఒక ఎకరాలకు వేయాలన్నారు. యూరియా అవసరానికి మించి వాడకూడదని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఐ.వెంకటేష్ మాట్లాడుతూ వరి నాట్లు వేసేటప్పుడు నారు చివర్లు కత్తిరించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ అధికారి పి.మాధవ మాట్లాడుతూ ఘన, ద్రవ జీవామృతంతో భూమిలో సహజ పోషకాలు, సూక్ష్మ జీవులు అభివృద్ధి చెంది, నాణ్యమైన అధిక దిగుబడులు పొందుటకు అవకాశం ఉందన్నారు. వ్యవసాయ సహాయకులు ఇ.రమణయ్య, రైతులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మహాసభలు జయప్రదం చేయాలి

కొండపి: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు గుమ్మల్ల సురేష్ ప్రధాన కార్యదర్శి ఎం. మాలకొండయ్య పత్రిక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 24, 25 తేదీల్లో జరుగుతాయన్నారు.

ఆరోగ్య సమాజ నిర్మాణం అందరి బాధ్యత



పామూరులో అవగాహన ర్యాలీ

పామూరు: ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీఐ ఎం.భీమానాయక్ అన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాలవల్ల అనర్థాలు, సైబర్ నేరాలు తాజా పోకడలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణ మొదలైన అంశాలపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్సైలు టి.కిషోర్‌బాబు, ఆర్.సుమన్, మధుసూదన్‌రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి



మాట్లాడుతున్న సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ: దొంగతనాలు అరికట్టడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ సీహెచ్ హజరత్తయ్య సూచించారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డు లోని గీతామందిరంలో శుక్రవారం సైబర్ నేరాలు– దొంగతనాలపై అవగాహన కల్పించారు. ఎస్సై బి. మహేంద్ర, కొత్తూరి శ్రీరంగనాయకులు, గాదంశెట్టి విజయ్, బచ్చు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సనాతన ధర్మమా.. సామాజిక న్యాయమా!

కనిగిరి రూరల్: సనాతన ధర్మమా.. సామాజిక న్యాయమా అనే అంశంపై శనివారం ఉదయం 10 గంటలకు ఒంగోలులోని మల్లయ్య లింగంభవన్‌లో జరిగే సదస్సును విజయవంతం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్ అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. నేడు సమాజంలో అనేక అవాంతరాలు ఏర్పడుతున్నాయని, ధర్మం పేరుతో ప్రజలను విచ్ఛిన్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల మధ్య విద్వేషాలు, విభేదాలు సృష్టించి రాజకీయ పార్టీలు పబ్బం గడుపుకుంటున్నాయని మండిపడ్డారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కరవది సుబ్బారావు, సాహితి వాది, సాహితి విమర్శకులు ముత్తేవి రవీంద్రనాథ్, సామాజిక హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పాల్గొంటారని తెలిపారు. మేధావులు, ఉద్యోగులు, బహుజనులు, ప్రజా సంఘాలు, విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పశుగణన పారదర్శకంగా చేయాలి

కందుకూరు రూరల్: అఖిల భారత 21వ పశుగణన పారదర్శకంగా చేయాలని నెల్లూరు జిల్లా జెడీ కె.రమేష్ నాయక్ అన్నారు. కందుకూరు డివిజన్ పశుసంవర్థక శాఖ ఉప సంచాలకుల కార్యాలయంలో డివిజన్‌లోని ఏడీఏలు, పశు వైద్యాధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడీ మాట్లాడుతూ డివిజన్‌లో నియమించిన 69 ఎన్యూమరేటర్లు డివిజన్‌లోని 1,10,204 గృహాల్లో పశు గణన చేయాలని చెప్పారు. ఈ పశుగణన వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు జరుగుతుందన్నారు. 4–8 నెలలు నిండిన ఆడ దూడలకి బ్రూసెల్లోసిస్ టీకాలు వేయాలని తెలిపారు. యాంటీ బయోటిక్స్ అవసరమైన మేరకే వాడాలని సూచించారు.

ప్రత్యామ్నాయ పంటలు అవసరం



కనిగిరి: మాట్లాడుతున్న ఏడీఏ వెంకట రమణ

కనిగిరి రూరల్: పొగాకు రైతులు పత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని ఏడీఏ ఇ. వెంకట రమణ అన్నారు. మండలంలోని గుడిపాడులో ఏఓ పి. జోత్స్న దేవి అధ్యక్షతన అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటల సాగు వాటి వలన కలిగే లాభాలు, ఉపయోగాల గురించి పొగాకు రైతులకు తెలిపారు. పొగాకు అధికంగా సాగు చేయడం వలన భూమిలో పోషకాల లభ్యత తగ్గుతుందని వివరించారు. అందుకే శనగ, మినుము, పెసర, బొబ్బర, నువ్వులు, జొన్నలు, కొర్రలు వంటి పంటలు సాగు చేయాలన్నారు. సిబ్బంది ఎం. యోగేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

కొండపి: పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు ఆసక్తి చూపాలని వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం వెన్నూరులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆముదం, బంతి, జొన్న, మొక్కజొన్న పండించాలన్నారు. ఐటీసీ మేనేజర్ చంద్రశేఖర్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ మోతిలాల్ పాల్గొన్నారు.

టంగుటూరు: రైతులు మొత్తగా దుక్కులు దున్నుకొని సిఫారస్సు చేసిన ఎరువులను వేసుకొని వర్షాలు పడిన వెంటనే పొగ మొక్కలు నాటుకోవాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. వావిలేటిపాడులో శిక్షణ నిర్వహించారు. క్షేత్ర అధికారి ఉపేంద్ర, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు



విద్యార్థినికి డిక్షనరీ అందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

కొండపి: బంగారు బాల్యం వారోత్సవాల్లో భాగంగా జిల్లా స్థాయిలో తమ పాఠశాల విద్యార్థిని ద్వితీయ స్థానం సాధించడం పాఠశాలకు గర్వకారణంగా ఉందని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ పోటీల్లో జిల్లాలో ద్వితీయ స్థానం సాధించిన జె. శ్రీవల్లిని అభినందన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినికి ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్ డిక్షనరీ అందించారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్ష

పొన్నలూరు: హెల్మెట్లు లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై కె. అనుక్ హెచ్చరించారు. పొన్నలూరులో శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమతి పత్రాలు, హెల్మెట్లు లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి చలానా విధించారు.

వీధుల్లో కాంతులు

ఉలవపాడు: మండల కేంద్రమైన ఉలవపాడులో కొన్ని ప్రాంతాల్లో వీధిలైట్లు వెలిగాయి. సాక్షి దినపత్రికలో 'ఉలవపాడులో చీకట్లు' అని శుక్రవారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఉలవపాడులోని అంబేడ్కర్ నగర్, వడ్డెరపాలెంలోని బజారులో లైట్లు వేసి వెలిగించారు. ఇంకా కొన్ని కాలనీలో వీధి లైట్లు వేయాల్సి ఉంది. మిగిలిన చోట్ల కూడా మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మాదక ద్రవ్యాలు ప్రమాదకరం

ఉలవపాడు: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్సై అంకమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. జూదం, బెట్టింగ్ యాప్‌లు ఆడవద్దని తెలియజేశారు. మాదకద్రవ్యాలు తీసుకుని జీవితాలు నాశనం చేసుకోవద్దని తెలిపారు. సోషల్ మీడియా వాటి వలన జరిగే నష్టాల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైతువారీ కుంటలకు ప్రాధాన్యత



ఎం. నిడమానూరులో మాట్లాడుతున్న జోసఫ్ కుమార్

టంగుటూరు: గ్రామాల్లో రైతువారి కుంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ జోసఫ్ కుమార్ అన్నారు. ఎం. నిడమానూరులో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. నూతన జాబ్ కార్డులు మంజూరు చేయాలన్నారు. ఏపీడీ వెంకటస్వామి, ఏపీఓ సుభాషిణి, పంచాయతీ కార్యదర్శి సుబ్బాయమ్మ పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వరా?

- అవమానిస్తున్నారంటూ ఎంపీటీసీల ఆందోళన
- కోరం లేక 2 గంటలు వాయిదాపడిన సర్వసభ్య సమావేశం

ఉలవపాడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వకుండా అవమానపరుస్తున్నారని ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. మండల సర్వసభ్యసమావేశం ప్రారంభమైనా వారు దాదాపు రెండు గంటల పాటు కార్యాలయానికి రాకపోవడంతో కోరం లేక సమావేశం 2 గంటల పాటు వాయిదా పడింది. తరువాత అధికారులు చర్చలు జరపడంతో హాజరయ్యారు. ముందుగా కార్యాలయం బయట నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఎంపీపీ మస్తానమ్మ, జెడ్పీటీసీ అరుణ, వైస్ ఎంపీపీలు ఫజుల్, రమణయ్య, మండల కోఆప్షన్ సభ్యులు ఖాదర్ బాషా మీడియాతో మాట్లాడారు. మండలంలో ప్రభుత్వం మారిన తరువాత ఎంపీటీసీలకు ప్రోటోకాల్ ఇవ్వడంలేదని.. కనీస విలువ లేకుండా చేస్తున్నారని వాపోయారు. సర్వసభ్య సమావేశం కూడా కేవలం 2 రోజుల ముందే తెలియజేశారన్నారు. ఉలవపాడులో గురువారం గ్రామ సభ జరిగితే అసలు చెప్పలేదన్నారు. అధికారుల పై తమకు ఎలాంటి కోపం లేదన్నారు. ఎంపీటీసీ వాకా రాధామాధవి మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధుల ఫోన్లు ఎత్తడం లేదన్నారు. అందుకే కోరం జరగకుండా నిరసన వ్యక్తం చేశామని తెలిపారు. ఎంపీటీసీలు ఫైజున్నీసా, శ్రీహరి, రమణయ్య, పోకూరి లక్ష్మి పాల్గొన్నారు.

బైక్ దొంగలకు జైలు శిక్ష

కనిగిరి రూరల్: బైక్ దొంగలకు జైలు శిక్ష, జరిమాన విధిస్తూ కనిగిరి జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి కె. భరత్ చంద్ర శుక్రవారం తీర్పునిచ్చారు. పట్టణంలోని దూదేకుల సిద్దయ్య, పువ్వాడి కోటేశ్వరరావుకు చెందిన మోటార్ బైక్‌లు చోరీకి గురవడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. మండలంలోని చాకిరాలకు చెందిన మల్లెల కొండారెడ్డి, వినుకొండకు చెందిన పసుమర్తి లక్ష్మీ నారాయణ మోటార్ బైక్‌లు దొంగలించినట్లు గుర్తించారు. నేరం రుజువు కావడంతో నిందితులకు ఒక్కోరికి ఒక్కో కేసులో నాలుగు నెలల జైలు శిక్ష, రూ. 100 జరిమానా విధిస్తూ కనిగిరి జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి కె. భరత్ చంద్ర తీర్పు చెప్పారు.

తొమ్మిది మంది జూదరుల అరెస్ట్

పొన్నలూరు: మండలంలోని బాలిరెడ్డిపాలెం గ్రామంలో పేకాట ఆడుతున్న తొమ్మిది మంది జూదరులను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై అనుక్ సిబ్బందితో కలిసి దాడి చేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి దగ్గర నుంచి రూ. 5800 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

జనరల్ నోటీసు

మా క్లయింట్ ముప్పాళ్ళ శ్రీనివాసరావు S/o శ్రీరాములు నరిశెట్టివారిపాలెం గ్రామం, కందుకూరు మం॥ SPSR నెల్లూరు జిల్లా వారి సంజాయిషీ మేరకు ఇచ్చిన నోటీసు
1) గోళ్ళమూడి రంజిత్ కుమార్ S/o కృష్ణ ప్రసాద్, ఆధార్ నెం. 5807 7946 4363
2) శ్రీలత ముప్పాళ్ళ D/o శ్రీనివాసరావు, ఆధార్ నెం. 9311 5441 2244 అనువారు డాక్యుమెంట్ నెంబరు 12160/ 2024 క్రింద, కందుకూరు గ్రామం నందలి సర్వే నెంబర్ 274/1A, 22వవార్డు, 2వ బ్లాకు, డోర్ నెం. 22-2-3A అసెస్మెంట్ నెం. 1033014653, HSC 19210, HSC 20129, HSC 20130, HSC 20131లతో పవర్ కనెక్షన్లు గల ఇల్లు (RCC Slab) మరియు ఖాళీ స్థలమును కొనుగోలు చేసి మా క్లయింట్‌కు అనగా ముప్పాళ్ళ శ్రీనివాసరావు S/o శ్రీరాములు, నరిశెట్టివారిపాలెం పై ఆస్తి గురించి GPA, లింకు డాక్యుమెంట్లు మరియు ఒరిజినల్ డాక్యుమెంట్లు ఇచ్చినారు. తే20-09-2024దీన లింకు డాక్యుమెంట్లలో ఒకటైన 692/2006 మా ఊరి నుండి R.T.C బస్‌స్టాండ్, కందుకూరు దారిలో పోయినది. దొరికినవారు మొబైల్ నెంబర్ . 99511 61767 కు తెలియచేయగలరు.

ఇట్లు: బి.సాయిశంకర్
అడ్వకేట్, కందుకూరు